క్లుప్తంగా

సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే సత్యం పూజలు



చొప్పదండి ఎమ్మెల్యే సత్యంను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ముస్తాబాద్: మండలంలోని కొండాపూర్ సాయిబాబా ఆలయ ఉత్సవాల్లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక పూజలు చేశారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను నిర్వహిస్తుండగా, ఆదివారం జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సత్యం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ తలారిరాణి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సింగిల్‌విండో మాజీ వైస్‌చైర్మన్ బొందుగుల దేవిరెడ్డి, రాజు, కరుణాకర్, దేవానంద్, కిశోర్, వెంకన్న, అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ట్యాబ్ అందజేత

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన ఒగ్గు శ్రీనిధి ఇంటర్ బైపీసీలో 440 మార్కులకు గాను, రాష్ట్రస్థాయిలో 435 మార్కులు సాధించడంతో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రోత్సాహకంగా ఇచ్చిన ట్యాబ్‌ను ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందజేశారు. ఎమ్మెల్యే స్వయంగా విద్యార్థిని ఇంటికి వెళ్లి ట్యాబ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం విద్యార్థినిని అభినందించారు.

నేటినుంచి ఉచిత శిక్షణ

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీ రాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5నుంచి 10 వరకు పాలిసెట్ 2025 ప్రవేశపరీక్షకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరచారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 13న పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

చెట్టుపైకి ఎక్కి.. విద్యుత్ తీగలు సరిచేసి



తంగళ్లపల్లి: వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించేందుకు మండల సెస్ సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. ఆదివారం రాత్రి గాలి బీభత్సానికి విద్యుత్ తీగలు చెట్టుకు అల్లుకోగా సెస్ సిబ్బంది చెట్టు టార్చ్‌లైట్ వెలుతురులో చెట్టుపైకి ఎక్కి సరిచేసి విద్యుత్ పునరుద్ధరించారు. ఈ విషయాన్ని సెస్ గ్రూపులో తెలపడంతో వినియోగదారులు సిబ్బందిని అభినందించారు.

అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న కరస్పాండెంట్ నాగరాజు

చందుర్తి: డిజిటల్ తరగతుల విద్యాబోధనలో జాతీయ ఉత్తమ అవార్డును మండలకేంద్రంలోని నవత పాఠశాలకు దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన అవార్డు పంపిణీలో లీడ్ ప్రొపెల్ ఫౌండర్ సీఈవో దీపక్‌మోహర చేతులమీదుగా మండలకేంద్రానికి చెంది న నవత ఇంగ్లిష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ పత్తిపాక నాగరాజు అందుకున్నారు. పాఠశాలకు జాతీయ ఉత్తమ అవార్డు దక్కడం అభినందనీయమని కరస్పాండెంట్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



ఎల్లారెడ్డిపేట: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరమని ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం అందించారు. నాయకులు పందిర్ల లింగంగౌడ్, రాములు, పందిర్ల శ్రీనివాస్‌గౌడ్, గంట అంజాగౌడ్, బుచ్చాగౌడ్, గంట వెంకటేశ్ గౌడ్, అంతర్పుల గోపాల్ తదితరులున్నారు.

మున్సిపల్ పార్క్‌లో విరిగిపడిన చెట్టు

వేములవాడ: మండల పరిషత్ ఆవరణలోని మున్సిపల్ పార్క్‌లో చెట్టు ఆదివారం విరిగిపడింది. చిన్నారులు ఆడుకోవడం, వాకర్స్ వాకింగ్ చేసే ప్రాంతంలోనే ఈ చెట్టు విరిగి పడటంతో ఇబ్బందులు పడ్డారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయాన్ని వాకర్స్ మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో విరిగిన చెట్టును తొలగిస్తామని చెప్పారు.

చెరువు కట్టకు పగుళ్లు



నెర్రెలుబారిన బండపల్లి చెరువు కట్ట



బండపల్లి- ఎన్గల్ గ్రామాల మధ్య కూలిన కాలువ గైడ్ వాల్

- వర్షాకాలంలో బండపల్లి చెరువు కట్టకు ముప్పు
- ఎక్కడికక్కడే శిథిలావస్థకు చేరిన కాలువలు
- కూలిపోయిన కాలువలు, గైడ్ వాల్స్
- మరమ్మతు చేపట్టాలని విజ్ఞప్తి

చందుర్తి: రైతులకు సాగునీటి కష్టాలు తీర్చాలని ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా నిర్మాణం చేపట్టిన చెరువుకట్టకు పగుళ్లుబారాయి. కట్ట పొడువునా ఎక్కడపడితే అక్కడే పగుళ్లుబారి నెర్రెలు బారడంతో వర్షాకాలంలో చెరువుకట్టకు ముప్పు వాటిల్లుతుందని రైతులు దిగులు చెందుతున్నారు. మండలంలోని బండపల్లి ఊరచెరువును మినీ రిజర్వాయర్‌గా నిర్మాణాన్ని 2014లో పూర్తిచేశారు. మూడు, నాలుగేళ్లుగా చెరువు కట్టపై భారీగుంతలు ఏర్పడి మోకాలులోతు గుంతల్లో వర్షాకాలంలో నీరు నిలిచింది. దీంతో కట్టపై భారీ పగుళ్లు ఏర్పడుతున్నాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. నిర్మాణ సమయంలో కట్టను సక్రమంగా రోలింగ్ చేయకపోవడంతో పగుళ్లు బారుతున్నాయన్నా అభిప్రాయాన్ని రైతులు అభిప్రాయపడుతున్నారు. వానాకాలంలో పగుళ్లు బారిన నెర్రెలలో వర్షపునీరు చేరి కట్ట కొట్టుకుపోయే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. కాలువలు, ఉపకాలువల నిర్మాణాలు ఎక్కడిక్కడే కూలిపోయాయి. కూలిన కాలువలతో సాగునీరు ఎలా అందుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వినియోగంలోకి రాకముందే పగుళ్లుబారి శిథిలావస్థకు చేరుకున్న ఎల్లంపల్లి కాలువలపై ప్రత్యేక కథనం..

కొరవడిన నాణ్యత

వేములవాడ నియోజకవర్గంలోని 98వేల ఎకరాలకు సాగునీరందించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 2008లో మల్యాల శివారులో ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం రెండో విడతల్లో రిజర్వాయర్, పైపులైన్, కాలువ పనులకు శ్రీకారం చుట్టారు. మండలంలోని బండపల్లి(ఊర చెరువు) పనులకు భూసేకరణ పూర్తిచేసి పనులు చేపట్టేవరకు నాలుగేళ్లు గడిచింది. ఈ పనులన్నీ పూర్తయ్యేవరకు 5 ఏళ్లు పట్టింది. టెండర్లు దక్కించుకున్న కంపెనీలు పనిచేయకుండా సబ్ కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడంతో నాణ్యతా ప్రమాణాలు గాలికొదిలేశారన్న ఆరోపణలున్నాయి. పనులు పూర్తిచేసిన ఏడాదిలోపే కాలువలు, నిర్మించిన గైడ్ వాల్స్ శిథిలావస్థకు చేరాయి. రూ. కోట్లాదితో పనులు చేపట్టగా కాలువలు, గైడ్‌వాల్స్ కూలిపోయాయి.

అధ్వానంగా కాలువలు, గైడ్‌వాల్స్

బండపల్లి ఊరచెరువును మినీ రిజర్వాయర్‌గా ఆధునీకరించారు. చెరువు ద్వారా 2,750 ఎకరాలకు సాగునీరందించేందుకు కుడి కాలువల ద్వారా బండపల్లి, బావుసాయిపేట, మామిడిపల్లి, బొల్లారం వరకు 7కిలోమీటర్ల కాలువను నిర్మించగా కూలిపోయాయి. ఎడమ కాలువల ద్వారా బండపల్లి, కిష్టంపేట, ఎన్గల్, న్యాజీపేట వరకు ఆరుకిలో మీటర్ల వరకు నిర్మించారు. నిర్మించిన రెండేళ్లకే కాలువలు, గైడ్‌వాల్స్ పగుళ్లుబారి కూలిపోయాయి.

కాలువల నిండా ముళ్లపొదలే

సాగునీరందించేందుకు నిర్మించిన కాలువలు ముళ్ల పొదలతో నిండిపోయాయి. దీంతో కాలువలకు నీరు వదిలినా నీరు ముందుకు సాగడం లేదు. గత ఐదేళ్లుగా వాటి నిర్వహణను పట్టించుకునే వారు లేరని రైతులు వాపోతున్నారు. మరికొందరు కాలువ భూములను ఆక్రమించి సాగు చేసుకుంటుండగా , మరికొంతమంది కాలువల్లో మట్టిని నింపి దారులు ఏర్పాటు చేసుకున్నారు.

మరమ్మతు చేపట్టాలి



గతేడాది నుంచి చెరువు కట్టపై పగుళ్లుబారి భారీ నెర్రెలుబారుతుంది. వానాకాలంలో నెర్రెల్లోకి నీరు చేరి కట్టకోతకు గురయ్యే అవకాశం ఉంది. ఏడాదిగా మరమ్మతులు చేపట్టాలని విన్నవించినా పట్టించుకునే వారే లేరు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేయాలి. – న్యాత దినాకర్, రైతు, బండపల్లి

పొలాలు కొట్టుకుపోతాయి



వానాకాలంలో భారీవర్షాలు పడితే కట్ట ఎక్కడ గండి పడుతుందోనని భయపడుతున్నాం. ఇప్పటికే చెరువు కట్ట సమయంలో పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో వర్షాకాలంలో నీరు లీకేజీ అవుతోంది. గతంలో కురిసిన భారీవర్షాలకు గండి పడిపొలాలు కొట్టుకుపోతే మళ్లీ సాగు చేసుకునేందుకు నానా తిప్పలు పడ్డాం. – విక్కుర్తి శ్రీనివాస్, రైతు, బండపల్లి

నిర్మించినా ప్రయోజనం లేదు



కాలువలు నిర్మించి ఐదేళ్లు గడిచినా సాగునీరు రాలేదు. చేను పక్క నుంచి కాలువ నిర్మాణం చేపడితే పంటలకు సాగునీరందుతుందని ఆశపడ్డా. ప్రస్తుతం కాలువ నిండా ముళ్ల పొదలతో నిండిపోయాయి. కొన్ని చోట్ల కాలువలు కూలిపోయాయి. ఇప్పటికైనా కాలువలు నిర్మించి సాగు నీరందించాలి. –గడ్డం అనిల్, యువరైతు, బండపల్లి

కమలంలో కలహం!

- బీజేపీ పట్టణ అధ్యక్షుడి నియామకంపై వ్యతిరేకత
- బహిరంగ లేఖలతో వ్యంగ్యాస్త్రాలు
- సిరిసిల్లలో హాట్‌టాపిక్

సిరిసిల్లటౌన్: కమలం పార్టీలో కలహం మొదలైంది. సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడి నియామకంపై వ్యతిరేకత ఎదురైంది. సీనియర్లను, పార్టీ సిద్ధాంతాలు, రాజకీయ పరిణతిని వదిలి ఈ పదవి కట్టబెట్టారన్న నిరాశతో పార్టీ శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ విషయం ఆదివారం సోషల్‌మీడియా వేదికగా ఆ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలు స్థానికంగా కలకలం రేపాయి. బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్ష పదవి ఎన్నికపై పార్టీ పెద్దల తీరుపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్టీనే నమ్ముకుంటూ దశాబ్దాలుగా సేవలందించిన వారిని పెద్దలు విస్మరించారన్న ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈమేరకు తాజామాజీ కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్ పార్టీ అధిష్టానాన్ని తప్పుబట్టగా బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా ఇప్పటి వరకు బాధ్యతలు చేపట్టిన నాగుల శ్రీనివాస్ కొత్త కార్యవర్గానికి అభినందనలు తెలుపుతూనే.. పద్మశాలీలు పార్టీకి దూరం కాకుండా చర్యలు చేపట్టాలని బహిరంగ ప్రకటన చేయడం చర్చనీయాంశమైంది.

అసలు ఏమి జరిగింది

పార్టీ జిల్లా అధ్యక్ష పదవి తర్వాత అంతటి ప్రాధాన్యత గలది సిరిసిల్ల పట్టణ అధ్యక్ష పదవి. దీనికి ఆ పార్టీ సేవకుల నుంచి అధిష్టానం నామినేషన్లు కోరింది. ఎన్నికల అధికారిగా కొక్కు దేవేందర్‌యాదవ్ నియమితులయ్యారు. పదవి ఆశిస్తూ 11 మంది నామినేషన్లు వేయగా.. అందులో ముగ్గురి వయసు 45 ఏళ్లు దాటిందని తిరస్కరించారు. అయితే పట్టణ అధ్యక్షుడిగా నామినేషన్లు వేసిన వారిని కాకుండా కొత్త వ్యక్తిని నియమించారనే ఆరోపణలు వస్తున్నాయి.

నిబంధనలు విస్మరించలేదు

పార్టీ నిబంధనలు విస్మరించలేదు. ఆరోపణలు సరికాదు. పార్టీకి సేవలందించిన వారికి పదవుల్లో అవకాశాలు వస్తాయి. సిరిసిల్ల పట్టణ అధ్యక్ష పదవి ఎన్నికపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం. పార్టీ పెద్దల సూచనలు, పార్టీ అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తున్నాం. పార్టీ శ్రేణులు అందరిని కలుపుకుని ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుంటూ రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తాం. – రెడ్డబోయిన గోపి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా శ్రీకాంత్



దుమాల శ్రీకాంత్

సిరిసిల్లటౌన్: బీజేపీ సిరిసిల్ల పట్టణశాఖ అధ్యక్షుడిగా దుమాల శ్రీకాంత్ నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, పట్టణ సీనియర్ నాయకులందరికీ శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి



రామచంద్రారెడ్డి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిర గ్రామానికి చెందిన రేపాక రామచంద్రారెడ్డిని బీజేపీ మండల అధ్యక్షుడిగా నియమిస్తూ.. రాష్ట్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి రామచంద్రారెడ్డికి నియామక పత్రం అందజేశారు. మండలం నుంచి అధ్యక్ష పదవికి 22 మంది నామినేషన్లు వేశారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని రామచంద్రారెడ్డి తెలిపారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గోపికి కృతజ్ఞతలు తెలిపారు.



క్రాంతికుమార్

ముస్తాబాద్: బీజేపీ మండల అధ్యక్షుడిగా ఆవునూర్‌కు చెందిన సొల్ల క్రాంతికుమార్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఉత్తర్వులు జారీచేశారు. క్రాంతిని అంబేద్కర్ సంఘం నాయకులు, బీజేపీ శ్రేణులు అభినందించారు.

కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనులు పూర్తి చేయండి

ఎల్లారెడ్డిపేట: మల్కపేట రిజర్వాయర్ నుంచి వచ్చే 9వ ప్యాకేజీ కాల్వ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు విన్నవించారు. ఆదివారం మల్కపేట రిజర్వాయర్ కుడికాల్వ నుంచి నీటిని విడుదల చేసిన సందర్భంగా కలిసి ఈమేరకు విన్నవించారు. వెంటనే స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి కాలవ్వను పూర్తి చేయాలని సూచించినట్లు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, నాయకులు శ్రీనివాస్, బండారు బాల్‌రెడ్డి, గంట బుచ్చగౌడ్ పాల్గొన్నారు.

మద్యంతాగి వాహనాలు నడపొద్దు



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రెయినీ ఎస్సై వినీతారెడ్డి

తంగళ్లపల్లి: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యంతాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తంగళ్లపల్లి ట్రెయినీ ఎస్సై వినీతా రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై డ్రంకెన్ డ్రైవ్, వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు పరిశీలించి చలానాలు విధించారు. సీట్‌బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వాహన తనిఖీల్లో ఏఎస్సై చంద్రమౌళి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం



బోయినపల్లి: విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



ఇల్లంతకుంట : విద్యార్థులను సన్మానిస్తున్న సభ్యులు

బోయినపల్లి: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన మండలంలోని వెంకట్రావుపల్లి, బోయినపల్లి హైస్కూల్ విద్యార్థులను ఆదివారం పాఠశాల ఆవరణలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. బోయినపల్లిలో పెగ్గెర్ల కావ్య, ఒల్లెం అనుష్క, వెంకట్రావుపల్లి హైస్కూల్‌లో ఇల్లందుల రుచిత, మునుకు రవళి, నల్లాల అక్షిత ప్రియ, తీర్తాల అఖిల, అవినాశ్, శివరామ్, వెంకటేశ్వరిని సన్మానించి మెమొంటోలు అందించారు. హెడ్‌మాస్టర్లు భూమయ్య, బీ, తిరుపతి, అన్నాడి ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు తారకాదేవి, అరుణశ్రీ, పద్మ, శైలజ, వనజ, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన మండలంలోని పెద్ద లింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఆదివారం అంబేడ్కర్ యువజన సంఘం కమిటీ సభ్యులు అభినందించి సన్మానించారు. చెలిమెల జస్వంత్ 546, పయ్యావుల వైష్ణవి 530, కీర్తి శ్రీరామ్ 529 మార్కులు సాధించగా అభినందించారు. ఇక్కడ నరేశ్, శ్రీనివాస్ ,శనిగరం అనిల్, జాన్, సంజిత్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



కళాకారులను సన్మానించిన గ్రామస్తులు

చందుర్తి : మండలంలోని నర్సింగపూర్‌లో రెండు రోజులుగా సాధు సజ్జన భజన మండలి సభ్యులు ప్రదర్శించిన రామాయణ ప్రదర్శన గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అంతరించుతున్న కళలకు జీవం పోస్తున్న కళాకారులను మాజీ ఉపసర్పంచ్ కాసారపు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడరూరల్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణ పరిధిలోని శాత్రాజుపల్లిలో రూ.కోటి 43లక్షలతో అర్బన్‌ప్రైమరీ హెల్త్‌సెంటర్ (యూపీహెచ్‌సీ) భవన నిర్మాణానికి ఆదివారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. వార్డులలో ఇప్పటికే సైడ్ డ్రైన్ నిర్మాణానికి రూ.12 లక్షలతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ..నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

సుందరీకరణ పనులకు శంకుస్థాపన

పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్ నుంచి చెక్‌డ్యామ్ వరకు మిగిలిన బండ్ అభివృద్ధి, సుందరీకరణ పనులకు విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శంకుస్థాపన చేశారు. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ...తిప్పాపూర్ నుంచి మూలవాగు ఎడమవైపు రూ.80 లక్షలతో సుందరీకరణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధికి పెద్దపీట వేశామని, ఇప్పటికే పలుసార్లు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించామన్నారు. రాజన్న గుడి చెరువులోకి మురుగు నీరు కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేశ్, సెస్ డైరెక్టర్ నామాల ఉమ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు సంగ హన్మవ్వ, రెండుమిద్దెల జయ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బింగి మహేశ్, అధికారులు, నాయకులు బాశెట్టి రవీందర్, లింగంపల్లి కిరణ్, హైమద్‌పాషా, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో పూజలు

చందుర్తి: మండలంలోని కట్టలింగంపేటలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠాపనలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని పూజలు చేశారు. ఆధ్యాత్మిక చింతనతో ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. రుద్రంగి మార్కెట్ చైర్మన్ తిరుపతి, పార్టీ మండలఅధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు ఆవారి మనోహర్, అజన్‌రావు, రమేశ్, లక్ష్మణ్‌రావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేములవాడ రూరల్ : హన్మాజీపేటలో సమావేశమైన పూర్వ విద్యార్థులు



చందుర్తి: మల్యాలలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో..



ముస్తాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



బోయినపల్లి: సమావేశమైన వెంకట్రావుపల్లి పూర్వ విద్యార్థులు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట జెడ్పీఉన్నత పాఠశాలలో 2009-10లో పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువుల ను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయలు విఠల్, శ్రీనివాస్, పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999-2000లో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ముస్తాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు నార్ల సతీశ్, భరత్, జయంత్, అంజు, శ్రీనివాస్, తాళ్ల శ్రీని వాస్‌గౌడ్, శేఖర్, కుమార్, భాను తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: మండలంలోని మల్యాల జెడ్పీహెచ్ఎస్‌లో 1999-2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని ఆనందంగా గడిపారు. ప్రధానోపాధ్యాయులు పోతులూరి చారి, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, లింగయ్య, రవీందర్, నాగరాజు, అంజనేయులు, పూర్వ విద్యార్థులు యెల్ల నరేశ్, మర్రి తిరుపతి, లక్ష్మీనర్సయ్య, మధు, తిరుపతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: వెంకట్రావుపల్లి హైస్కూల్‌లో 2007-2008లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో జరిగింది. గతంలో పాఠాలు బోధించిన ప్రధానోపాధ్యాయుడు టీ.సత్యనారాయణ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సందర్భంగా తోటి పూర్వ విద్యార్థి కూతురు అనారోగ్యంబారిన పడగా పూర్వ విద్యార్థులు రూ.25వేలు ఆర్థికసాయంగా అందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

ఎల్లారెడ్డిపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌చెందిన రమావత్ బాల్య (70) పింఛన్ డబ్బుల కోసం గొల్లపల్లిలోకి బ్యాంకుకు వెళ్లాడు. రోడ్డు దాటుతుండగా కామారెడ్డి నుంచి వస్తున్న మహారాష్ట్రకు చెందిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రమావత్ బాల్యను 108 వాహనంలో ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడి కుమారుడు మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

పిడుగుపాటుతో గేదె మృత్యువాత



ఎల్లారెడ్డిపేట : బుగ్గరాజేశ్వరతండాలో మృత్యువాతపడిన గేదె

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బుగ్గరాజేశ్వరతండాలో బానోతు రాజు అనే రైతుకు చెందిన పాడిగేదె పిడుగుపాటుతో మృత్యువాత పడింది. ఆదివారం ఈదురుగాలుతో కూడిన వర్షం కురిసింది. గ్రామ శివారులో పొలంవద్ద పాడిగేదెపై పిడుగు వేయడంతో మృతిచెందింది. దీంతో రూ. 40 వేల నష్టంవాటిల్లినట్లు బాధితరైతు వాపోయాడు.

తంగళ్లపల్లి: సారంపల్లి గ్రామ రైతు రాముల లింగయ్యకు చెందిన గేదె ఆదివారం పిడుగుపాటుకు గురై మృత్యువాత పడింది. దీంతో రూ.లక్ష నష్టం జరిగినట్లు రైతు లింగయ్య తెలిపాడు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం చోరీ

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి కొనుగోలు కేంద్రంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధాన్యం ఎత్తుకెళ్లారు. రైతు గజ్జెల మల్లయ్యకు చెందిన 8 క్వింటాళ్ల ధాన్యం ఎత్తుకెళ్లారు. ఆరుగాలం శ్రమంచి పండించిన ధాన్యం దొంగల పాలైందని, కొనుగోలు కేంద్రంలో సరైన సౌకర్యాలు లేకపోవడంతోనే ధాన్యం ఎత్తుకెళ్లారని మల్లయ్య విలపించాడు. దీనిపై ఏపీఎం నర్సయ్యను ఫోన్‌లో వివరణ కోరగా తన దృష్టికి రాలేదన్నారు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా : 9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
సిరిసిల్ల : శ్రీకాంత్ - 6281700456
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899